క్లుప్తంగా

ప్రణాళికలు తప్పనిసరి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసరావు

బొండపల్లి: గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయిలో సభలు నిర్వహించి, ప్రణాళికలు సిద్ధం చేయాలని వేంద్రాం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక సచివాలయం వద్ద వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులతో గ్రామాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసుకోవాలన్నారు.

సంతకాల సేకరణ



జామిలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గేదెల తిరుపతి, తదితరులు

జామి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ గేదెల తిరుపతి ఆధ్వర్యంలో 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోలతో కూడిన స్పష్టమైన ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో నేతలు బోని అప్పారావు, ఎన్.సత్యనారాయణ, బీల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన



బస్సు షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న లెంక శ్రీలక్ష్మి, తదితరులు

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నేత లెంక శ్రీలక్ష్మి శనివారం శంకుస్థాపన చేవారు. గ్రామానికి చెందిన కెంగువ అప్పలనాయుడు తన తల్లిదండ్రులు కన్నంనాయుడు, చిన్నప్పలమ్మల జ్ఞాపకార్థం బస్సు షెల్టరు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు లెంక గణేష్ తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులచే పదాలు రాయిస్తున్న ఎంఈఓ బాల భాస్కరరావు

వేపాడ: వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే గణితం, తెలుగు, ఆంగ్ల పదాలను బోర్డుపై రాయించి, చదివించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం



ప్రధాన రహదారిపై పడిన భారీ మర్రి చెట్టు

గుర్ల: మండల కేంద్రంలోని భారీ మర్రి చెట్టు శనివారం కూలిపోయింది. గుర్ల, గరికివలస ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మర్రి చెట్టు వంద ఏళ్లుగా ఉందని, గ్రామస్తులు మర్రి చెట్టు వద్ద గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎంపీడీఓ రవికుమార్ పరిశీలించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

టీ షాపుల్లో అంగన్‌వాడీ పాలు



స్వీట్స్, టీషాపునకు చెందిన ఫ్రిజ్‌లో ఉన్న ప్రభుత్వం సరఫరా చేసే పాల ప్యాకెట్లు

గుర్ల: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరాచేసిన పాలప్యాకెట్లను కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు టీ షాపులకు అమ్మకాలు జరుపుతున్నారు. మండల కేంద్రంలోని ఓ టీ షాపు, బేకరీలో ప్రభుత్వం అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న పాలతో స్వీట్లు, టీలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని సీడీపీఓ ఎస్.ఆరుద్ర వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాల ప్యాకెట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిపై విచారణ చేపడతామని చెప్పారు.

గేట్లు ఎత్తేశారు

- మంత్రి కొండపల్లి ఇలాకాలో ఏరులై పారుతున్న మద్యం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు
- ప్రతి గ్రామంలో గణనీయంగా పెరిగిన బెల్ట్ షాపులు
- బాటిల్‌పై రూ. 50 వరకు అదనంగా విక్రయిస్తున్న వైనం

గంట్యాడ: కూటమి సర్కార్ పాలనలో మద్యం ఏరులై పారుతోంది. మంచినీళ్లు అయినా దొరుకుతాయో, లేదో గాని మద్యం అయితే మాత్రం మంచినీళ్లు కంటే అధికంగా దొరుకుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు బెల్ట్‌షాపుల దగ్గరకే మద్యం సరఫరా కావడంతో తెల్లావారుజాము 4 గంటల నుంచే మందుబాబులు చుక్కేస్తున్నారు. కొద్ది రోజులుగా బెల్ట్ షాపుల నిర్వాకులు మరింతగా తెగించేస్తున్నారు. కూటమి నేతలు కూడా బెల్ట్‌షాపుల నిర్వాహకులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బెల్ట్‌షాపుల నిర్వాహకులు గేట్లు తెరిచేసి, బహిరంగంగానే మద్యం విక్రయించేస్తున్నారు. ఇదంతా ఎక్సైజ్ అధికారుల కనుసన్నలలో జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

మంత్రి కొండపల్లి ఇలాకాలో..

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తోలు తీస్తాం.. నార తీస్తాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కాని సాక్షాత్తూ జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంట్యాడ మండలంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. మద్యం ఏరులై పారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో కొన్ని గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించి మరీ బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం విశేషం. ఒక్కో బాటిల్‌పై రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తూ రెండు చేతులా డబ్బులు సంపాదిస్తున్నారు.



గంట్యాడ మండలం బుడతానపల్లిలో బెల్ట్ దుకాణం వద్ద మద్యం సేవిస్తున్న మందుబాబులు

కేసులు నమోదు చేస్తున్నాం..

బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడు లు చేపట్టి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం ఎక్కడా బెల్ట్ షాపులు నిర్వహించకూడాదు. ఎవరైనా నిబంధనలు విరుద్ధంగా మద్యం విక్రయించినా, రవాణా చేసినా శిక్ష తప్పదు. – విజయలక్ష్మి, ఎక్సైజ్ సీఐ

గణనీయంగా పెరిగిన బెల్ట్ షాపులు..

గ్రామాల్లో బెల్ట్ షాపులు గణనీయంగా పెరిగాయి. మూడు నెలల కిందట వరకు గ్రామాల్లో 5 నుంచి 10 వరకు దుకాణాలుంటే.. ప్రస్తుతం చిన్న గ్రామాల్లో అయితే 20 నుంచి 25 వరకు.. పెద్ద గ్రామాల్లో అయితే 30 నుంచి 40 వరకు ఉన్నాయి. ఇంత పెద్దెత్తున మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారుల్లో చలనం రాకపోవడం అనేక ఆరోపణలకు తావిస్తోంది. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటు అభినందనీయం

- ఎంపీటీసీ సభ్యురాలు భవానీ, సర్పంచ్ పాపునాయుడు

గంట్యాడ: పాఠశాలలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీటీసీ సభ్యురాలు పాటుపురెడ్డి భవానీ, సర్పంచ్ వర్రి పాపునాయుడు అన్నారు. మండలంలోని పెదవేమలిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవీ క్లబ్ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్వసతీదేవి, వివేకనందుని విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.



గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు భవానీ, సర్పంచ్ పాపునాయుడు, తదితరులు

కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు పి. కృష్ణారావు, కార్యదర్శి బి. శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు బి.నూకరాజు, హెచ్‌ఎం పి. సురేష్‌నాయుడు, ఉప సర్పంచ్ చప్ప నారంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి



గంట్యాడ: ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి

గంట్యాడ: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ పి. నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నందాంలో భూముల రీసర్వేపై శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు స్వచ్ఛందంగా రీ సర్వే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బాది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: దాసుపేటలో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, రైతులు

సద్వినియోగం చేసుకోవాలి..

దత్తిరాజేరు: భూముల సరిహద్దులు గుర్తించడానికి.. భూ సమస్యలు పరిష్కరించడానికి చేపడుతున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డీటీ రత్నకుమారి, మండల సర్వేయర్ అప్పలస్వామి అన్నారు. మండలంలోని ఎస్ చింతలవలస, దాసుపేట గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్లు డేవిడ్, రమేష్, వీఆర్వో బలరాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో భళా..

శృంగవరపుకోట: బాడీ బిల్డింగ్ పోటీల్లో ఎస్.కోట వాసులు భళా అనిపించారు. గత నెల 28న విజయనగరంలో ఆనంద గజపతి ఆడిటోరియంలో కనకల ఎర్రయ్య మెమోరియల్ క్లాసికల్ కప్ 32వ ఓపెన్ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సుమారు 200 బాడీ బిల్డర్‌లు 8 కేటగిరీల్లో తలపడ్డారు. అలాగే మాస్టర్స్ ఒక గ్రూపుగా పోటీపడ్డారు. ఈ పోటీల్లో 75 కిలోల విభాగంలో ఎస్.కోటకు చెందిన కోన రమణ 5వ స్థానంలో, మాస్టర్స్ విభాగంలో 2వ స్థానంలో నిలిచాడు. మాస్టర్స్ విభాగంలో పిన్నింటి అప్పారావు 3వ స్థానం.. 55 కిలోల విభాగంలో కోన మణిదీప్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. ఎస్.కోట బాడీబిల్డర్లు ఏపీ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.వీరారెడ్డి ఆధ్వర్యంలో పోటీలకు హాజరయ్యారు. విజేతలకు నిర్వాహకులు మెమోంటోలు, ధ్రువపత్రాలు అందజేయగా.. స్థానిక పెద్దలు, బాడీబిల్డర్లు విజేతలను శనివారం అభినందించారు.



ప్రతిభ చూపిన ఎస్.కోట బాడీ బిల్డర్లు

ఉద్యానవన రైతులను ఆదుకోవాలి

- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఈదురుగాలులతో కూడిన వర్ష బీభత్సానికి తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చినబంటుపల్లిలో ఈదురుగాలులకు నేలకొరిగిన బొప్పాయి పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఉద్యానవన శాఖాధికారులు పంట నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చారా అని రైతులను ప్రశ్నించగా.. ఉద్యానవనశాఖ అధికారి అనూష వచ్చి నష్టాన్ని అంచనా వేశారని రైతులు బదులిచ్చారు. అనంతరం చైర్మన్ శ్రీనివాసరావు ఉద్యానవనశాఖ డీహెచ్ఓ చిట్టిబాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ.. మెరకముడిదాం మండలంతో పాటూ జిల్లా బొప్పాయి, అరటి, మొక్కజొన్న పంటలు అధికంగా నష్టపోయాయని చెప్పారు. నష్ట నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.



చినబంటుపల్లిలో ఈదురుగాలులకు నేల కొరిగిన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం, రాజాం నియోజకవర్గాల పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, మెరకముడిదాం మండలానికి చెందిన నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పల్లి కృష్ణమూర్తి, కెంగువ సాంబ, సర్పంచ్‌లు పెనుమజ్జి అప్పలనారాయణ, అట్టాడ దేవ, సుంకరి రమేష్, నాయకులు కర్రోతు నాగేశ్వరరావు, సత్తారు శ్రీనివాసరావు, ప్రసాద్ సన్యాసినాయుడు, అన్నంనాయుడు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తిరుపతి వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ జేవీ రమణ అన్నారు. గరివిడిలోని వేంకటేశ్వర వెటర్నరీ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో బాస్కెట్ బాల్ మైదానాన్ని ప్రారంభించారు. అలాగే కళాశాల ఆవరణంలో గల శాస్త్రీయ పరిశోధన కేంద్రాన్ని, పరిరక్షణ ప్రదేశాన్ని, బోటానికల్ గార్డెన్స్‌ను ఆవిష్కరించారు. కళాశాలలో నిర్వహించిన క్లినికల్ కాన్ఫరెన్స్‌లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టమైన రంగాల్లో పయనిస్తే లక్ష్యాలను చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ మైదానాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ జేవీ రమణ

దుర్గాదేవిని దర్శించుకున్న 'కడుబండి'



దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని పాత సుంకరపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. మంటపం ఆవరణలో నిర్వహించిన చండీయాగం, హోమం, తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సూరిబాబు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం..

గజపతినగరం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఆటో డ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ. 15 వేల చొప్పున అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, జనసేన నాయకురాలు పడాల అరుణమ్మ, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, ఎం.శ్రీధర్, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఉష, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీర అంజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు

కొత్తవలస: మండలంలోని విశాఖపట్నం రోడ్డులో గల దేవీ గుడిలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు ఐదు వందల మంది పేద మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ముందుగా దుర్గాదేవికి లలితకుమారి, రామ్‌ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

చీపురుపల్లిరూరల్ (గరివిడి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించిన దుండగులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గరివిడిలో ఆ సంఘ అధ్యక్షుడు టొంపల సంజీవరావు, ఉపాధ్యక్షుడు బూర సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బోడసింగి పోలీస్ శనివారం మాట్లాడారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడం సిగ్గుచేటన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టంచేశారు.

జమ్ములో ఘర్షణ

గుర్ల: మండలంలోని జమ్ము గ్రామంలో దేవీ ఉత్సవాల్లో భాగంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య శనివారం రాత్రి ఘర్షణ జరిగింది. పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గం వారు దాడికి దిగారు. ఈ ఘటనలో ఓ యువకుడు స్పృహతప్పి కింద పడిపోయాడు. ఆయనకు స్థానికులు సపర్యలు చేశారు. అమ్మవారి ఉత్సవాలను అడ్డంపెట్టుకుని అధికార బలంతో తమపై దాడిచేశారంటూ పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆరోపించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆటో డ్రైవర్లను ఆదుకున్నాం..

గుర్ల: ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకున్నామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆటో ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 2118 మంది లబ్ధిదారులకు రూ. మూడు కోట్ల పదిహేను లక్షల చెక్కును ఆటో డ్రైవర్లకు అందజేశారు.

ప్రత్యేక పూజలు..



జామి మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు వరప్రసాద్ ఆచార్యులు స్వామిని అలంకరించి, భక్తుల గోత్రనామాలతో పూజలు చేపట్టారు. – జామి

ఆవిష్కరణ..



ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు వై.వెంకటరావు ఇచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. – శృంగవరపుకోట

నిరసన..



చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని ఖండిస్తూ దళిత ఉద్యమ నేత ఎ.ఉదయ్‌భాస్కర్, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. – శృంగవరపుకోట

ఆందోళన..



జిందాల్ తీసుకున్న తమ భూములు తిరిగి తమకు కేటాయించాలని నిర్వాసితులు కోరారు. ఈ మేరకు బొడ్డవరలోని ఎమ్మెల్సీ రఘురాజు నివాసంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలను శనివారం కూడా కొనసాగించారు. – శృంగవరపుకోట

అట్టర్ ఫ్లాప్ 'ఆటోవాలా షో'

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డప్పు కొట్టి, బాకా పెట్టి, ఊదరగొట్టి ఏర్పాటు చేసిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం కోటలో అట్టర్ ఫ్లాప్ షో అయ్యింది. శనివారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నేతృత్వంలో నియోజకవర్గ స్థాయి 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,735 మంది ఆటో డ్రైవర్లు ఉండగా కార్యక్రమానికి మాత్రం కనీసం 15 మంది కూడా హాజరుకాలేదు. దీంతో కూటమి నాయకులు కంగుతిన్నారు. మొత్తానికి కార్యక్రమం ఎలాగోలా తూతూమంత్రంగా ముగించేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సర్పంచ్ సంతోషికుమారి, మండల ప్రత్యేకాధికారి ఇ.మురళి, తహసీల్దార్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

డీసీసీబీ నాగార్జున జాగీరా?

- పరిపక్వత లేకుండా మాట్లాడడం దురదృష్టకరం
- మూడు దశాబ్దాలకు పైగా డీసీసీబీ వద్దనే కూర్చుంటున్న 'బొత్స' కుటుంబం
- 2014 నుంచి 2019 టీడీపీ హయాంలో కూడా అక్కడే కూర్చున్నారు
- ప్రతిపక్ష నేత హోదాలో సీఈఓను లిఖిత పూర్వకంగా కోరిన 'బొత్స'
- సీఈఓ సమాధానం చెప్పకుండా నాగార్జున రాజకీయం చేయడం తగదు

చీపురుపల్లి: కనీసం త్రీమేన్ కమిటీ కూడా లేకుండా ఒకే ఒక సింగిల్ నామినేటెడ్ డీసీసీబీ చైర్మన్ హోదాలో కూర్చున్న కిమిడి నాగార్జునకు డీసీసీబీ ఏమైనా సొంత జాగీరా?.. సింగిల్ నామినేటెడ్‌గా పదవిలో ఉండి ఆయనకు మాట్లాడే హక్కే ఉండదు.. పరిపక్వత లేకుండా ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి జాతరను రాజకీయం చేయడం సంస్కార హీనంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. చీపురుపల్లి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నాయకుడు బొత్స సత్యనారాయణ కోసం సంస్కారం లేకుండా మాట్లాడిన కిమిడి నాగార్జున తన హుందాతనాన్ని దిగజార్చుకున్నారని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న నాగార్జునకు చీపురుపల్లిలో సొంత పెదనాన్న కనీసం కుర్చీ కూడా వేయడం లేదని, కనీసం పట్టించుకోవడం లేదని అలాంటి వ్యక్తి 'బొత్స'ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. 1989 నుంచి మూడు దశాబ్దాలకు పైగా డీసీసీబీ వద్ద 'బొత్స' కుటుంబం కూర్చుని పైడితల్లి అమ్మవారి సిరిమాను ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగానే ఈ నెల 7న జరగనున్న సిరిమాను ఉత్సవానికి డీసీసీబీ వద్ద కూర్చునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపక్ష నేత హోదాలో శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డీసీసీబీ సీఈఓను లిఖిత పూర్వకంగా కోరినట్లు చెప్పారు. దానికి సీఈఓ సమాధానం చెప్పాల్సి ఉండగా ఆ సంస్థ సింగిల్ నామినేటెడ్ చైర్మన్ నాగార్జున ప్రెస్‌మీట్ పెట్టి సంస్కార హీనంగా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. సీఎం చంద్రబాబు వద్ద మెప్పు పొందడానికి మాత్రమే ఈ వ్యాఖ్యలు చేసినట్లు అర్థమవుతోందన్నారు. 2014 నుంచి 2019 టీడీపీ ప్రభుత్వంలో కూడా 'బొత్స' కుటుంబం డీసీసీబీ వద్ద కూర్చుని సిరిమాను పూజారి ఆశీస్సులు పొందినట్లు గుర్తు చేశారు. నియంతలా మాట్లాడుతున్న నాగార్జునకు దమ్ముంటే పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిపించి సభ్యులు ఓటు ద్వారా చైర్మన్ పదవిలోకి వెళ్లాలని సవాల్ విసిరారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. ఆ పైడితల్లి అమ్మవారు ఆయనకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎంపీడీఓ కార్యాలయం వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా?

డీసీసీబీ కార్యాలయం వద్ద ప్రెస్‌మీట్ పెట్టిన నాగార్జున ఉద్యోగులు తొలగింపులు విషయాన్ని ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. నాగార్జునకు దమ్ముంటే ఉద్యోగుల తొలగింపులు, పోలీస్ కేసులు తదితర విషయాలపై చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఫీల్డు అసిస్టెంట్లు, డీలర్లు, వీఓఏలు ఉద్యోగులను ఎవరి హయాంలో ఎంతెంత మందిని తొలగించారు.. ఎవరి హయాంలో ఎన్ని పోలీసు కేసులు నమోదయ్యాయి అనే విషయాలు బహిరంగంగా చర్చించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు పతివాడ రాజారావు, ఎంపీటీసీ గిరడ రాందాసు, వార్డు మెంబర్ రౌతు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.